క్లుప్తంగా

సీఎంఆర్‌ఎఫ్ చెక్కు అందజేత



తలకొండపల్లిలో బాధితుడికి చెక్కు అందిస్తున్న మోహన్‌రెడ్డి

ఆమనగల్లు: తలకొండపల్లి మండల కేంద్రానికి చెందిన మహేశ్వరి అనారోగ్యంతో ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స పొందింది. ఆమెకు కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి సహకారంతో రూ.16 వేలు ముఖ్యమంత్రి సహాయనిధి కింద మంజూరయ్యాయి. తలకొండపల్లి మండల కేంద్రంలో శుక్రవారం జరిగిన కార్యక్రమంలో బాధిత కుటుంబ సభ్యులకు పీసీసీ కిసాన్ సెల్ కార్యదర్శి మోహన్‌రెడ్డి సీఎంఆర్‌ఎఫ్ చెక్కును అందించారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ డైరెక్టర్ అజీం, డీసీసీ కార్యదర్శి రవీందర్‌యాదవ్, నాయకులు కృష్ణ, రమేశ్, రామ్మోహన్‌రెడ్డి, నర్సింహారెడ్డి, మల్లేశ్, నర్సింహ, యాదగిరి, సురేశ్, గణేశ్, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

పన్ను చెల్లింపుతో అభివృద్ధి



మున్సిపల్ సిబ్బందికి చెక్కును అందజేస్తున్న కొత్తకుర్మ సత్తయ్య

తుర్కయంజాల్: ప్రతి ఒక్కరూ పన్నులను సకాలంలో చెల్లించి దేశ అభివృద్ధికి సహకరించాలని టెస్కాబ్ వైస్ చైర్మన్, డీసీసీబీ చైర్మన్ కొత్తకుర్మ సత్తయ్య కోరారు. తుర్కయంజాల్ రైతు సేవా సహకార సంఘంకు చెందిన 10 ఆస్తులకు సంబంధించిన పన్ను రూ.8,66,604 చెక్కును శుక్రవారం మున్సిపల్ సిబ్బందికి అందజేశారు. కార్యక్రమంలో సంఘం సీఈఓ వై.రాందాసు, మున్సిపల్ రెవెన్యూ అధికారి శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు కంటి పరీక్షలు



విద్యార్థులకు నేత్ర పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యులు

ఆమనగల్లు: పట్టణంలోని ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాల, కస్తూర్బాగాంధీ గిరిజన బాలికల విద్యాలయం, గిరిజన బాలికల ఆశ్రమ పాఠశాలలో శుక్రవారం రాష్ట్రీయ బాల స్వస్థ కార్యక్రమంలో భాగంగా ఉచితంగా కంటి పరీక్షలు నిర్వహించారు. ఆయా పాఠశాలల్లో డాక్టర్లు శ్రీకాంత్, సృజల, కంటి వైద్య సహాయకులు చంద్రశేఖర్‌ల ఆధ్వర్యంలో విద్యార్థులకు కంటి పరీక్షలు నిర్వహించారు.అవసరమైన వారికి ఉచితంగా కంటి అద్దాలు పంపిణీ చేశారు.

సమస్యలపై ఎమ్మెల్యేకు వినతిపత్రం



ఎమ్మెల్యే రంగారెడ్డికి వినతిపత్రం అందజేస్తున్న చింతపల్లిగూడవాసులు

ఇబ్రహీంపట్నం రూరల్: తమ పట్టణంలో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని ఆదిబట్ల మున్సిపాలిటీ చింతపల్లిగూడ పట్టణ ప్రజలు ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డికి శుక్రవారం విన్నవించారు. చింతపల్లిగూడ పట్టణంలో అండర్ డ్రైనేజీ పూర్తిగా పాడైపోయిందని కొత్త భూగర్భ డ్రైనేజీ నిర్మాణం చేయాలని కోరారు. అలాగే చింతపల్లిగూడ గేటు వద్ద బస్సులు నిలపడం లేదని చెప్పారు. తక్షణమే ఆదిబట్ల మున్సిపాలిటీ కమిషనర్‌కు ఫోన్ చేసి అండర్ డ్రైనేజీ సమస్య పరిశీలించాలని ఎమ్మెల్యే ఆదేశించారు. ఆర్టీసీ డిపో మేనేజర్‌కు లేఖ రాశారు. అనంతరం ఆదిబట్ల మున్సిపాలిటీ కమిషనర్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో పీఏసీఎస్ డైరెక్టర్ సుధాకర్‌రెడ్డి, నాయకులు అశోక్, భిక్షపతి, రాజు, ఎల్లయ్య, నర్సింహ, శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

పంటల నమోదు చేసుకోండి

యాచారం: యాసంగి సీజన్‌లో రైతులు ఏఏ పంటలు పండిస్తున్నారో.. వాటి వివరాలను నమోదు చేసుకోవాలని యాచారం ఏఓ రవినాథ్ సూచించారు. మండల కేంద్రంలోని వ్యవసాయ శాఖ కార్యాలయంలో ఆయన శుక్రవారం విలేకరులతో మాట్లాడుతూ... 2024–25 యాసంగి పంటకాలం కింద ఏఏ పంటలు సాగు చేశారో మార్చి 15 లోపు నమోదు చేసుకోవాలని రైతులకు సూచించారు. పంటల నమోదుకు ఆయా క్లస్టర్లకుగాను అధికారులను నియమించినట్లు తెలిపారు. ఏఈఓలుగా విధులు నిర్వహిస్తున్న సంతోష్‌కుమార్, రాధమ్మ, రమేశ్, వసంతలు పంటల నమోదు చేపట్టనున్నట్లు పేర్కొన్నారు.

హైవేపై అడ్డగోలు పార్కింగ్

- నిత్యం ప్రమాదాలతో వాహనదారుల బెంబేలు
- జాతీయ రహదారిపై ఇరువైపులా యథేచ్ఛగా వాహనాల నిలిపివేత
- చర్యలు తీసుకోవాలని స్థానికుల విజ్ఞప్తి



పార్కింగ్ కోసం పోలీసులు ఏర్పాటు చేసిన సూచిక బోర్డు



విజయవాడ జాతీయ రహదారిపై నిలిపిన వాహనాలు

అబ్దుల్లాపూర్‌మెట్: పెద్దఅంబర్‌పేటలోని ఔటర్ రింగ్ రోడ్డు సమీపంలో విజయవాడ జాతీయ రహదారికి ఇరువైపులా అడ్డగోలుగా వాహనాలను పార్కింగ్ చేస్తుండడంతో చోదకులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. దీంతో నిత్యం ప్రమాదాలు సంభవించి పలువురు గాయపడగా.. కొందరు మృత్యువాత చెందుతున్నారు. ఓఆర్‌ఆర్ కూడలి నుంచి 200 మీటర్ల వరకు రింగ్ రోడ్డు నిర్వాహకుల పర్యవేక్షణ ఉన్నప్పటికీ అక్రమ పార్కింగ్‌పై చర్యలు చేపట్టడడంలో నిర్లక్ష్యం వ్యవహరిస్తున్నారనే విమర్శలు వినిపిస్తున్నారు. రింగ్ రోడ్డు సమీపంలో విజయవాడ జాతీయ రహదారికి ఇరువైపులా చిరు వ్యాపారులు, హోటళ్లు ఉండడంతో 24గంటల పాటు వాహనాలు ఇక్కడే పార్కింగ్ చేస్తున్నారు. అయితే ఈ వాహనాలను రోడ్డు కిందకు నిలిపితే ఎలాంటి ఇబ్బంది ఉండనప్పటికీ అలా కాకుండా వాటిని రహదారిపైనే గంటల పాటు నిలిపివేస్తున్నారు. అకస్మాత్తుగా వాహనాలను ముందుకు, పక్కకు తీస్తున్న క్రమంలో వెనుక నుంచి వస్తున్న చోదకులు ఆందోళనకు గురై రోడ్డు ప్రమాదాల బారిన పడాల్సిన దుస్థితి నెలకొంటుంది. నిత్యం రోడ్డు ప్రమాదాలకు అడ్డాగా మారిన రింగ్ రోడ్డు కూడలిలో అక్రమ పార్కింగ్‌పై పోలీసులు చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

సమస్య పరిష్కారానికి కృషి

ఔటర్ కూడలి వద్ద ట్రాఫిక్ సమస్య మా దృష్టికి కూడా వచ్చింది. వనస్థలిపురం ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్‌ను సమన్వయ పరుస్తూ అక్రమ పార్కింగ్‌పై చర్యలు తీసుకుంటాం. అక్కడ ఉండే వ్యాపారులకు కూడా నిర్ణీత సమయాల్లో దుకాణాలను మూసివేసే విధంగా కఠినంగా ఆదేశాలు జారీ చేశాం. అదే విధంగా ఔటర్ నుంచి కొత్తగూడెం కూడలి వరకు జాతీయ రహదారిపై ప్రమాదాల నివారణకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నాం. రోడ్డుపై పార్కింగ్ చేయకూడదని, ఒకవేళ వాహనాలు నిలపాలనుకునే వారు పక్కనే ఉన్న పెయిడ్ పార్కింగ్‌ను ఆశ్రయించాలని సూచిక బోర్డులు ఏర్పాటు చేశాం. నిబంధనలను అతిక్రమించి అక్రమంగా పార్కింగ్ చేస్తే వాహనాలపై చర్యలు తీసుకుంటాం.

– అంజిరెడ్డి, సీఐ, అబ్దుల్లాపూర్‌మెట్



సమావేశంలో మాట్లాడుతున్న బీఆర్‌ఎస్ నాయకులు

రైతు దీక్షపై విమర్శలు తగవు

కడ్తాల్: రైతుల సంక్షేమానికి కృషి చేసింది గత కేసీఆర్ ప్రభుత్వమేనని బీఆర్‌ఎస్ యువజన విభాగం జిల్లా నాయకుడు కంబాలపల్లి అంజి పేర్కొన్నారు. శుక్రవారం మండల కేంద్రంలో పార్టీ నాయకులతో కలిసి ఆయన విలేకరులతో మాట్లాడారు. గత పదకొండేళ్లలో తెలంగాణ ప్రజల ఆత్మగౌరవాన్ని నిలబెట్టే విధంగా పాలన సాగించిందని గుర్తు చేశారు. ఇటీవల బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ చేపట్టిన రైతు దీక్ష కార్యక్రమంపై పలువురు కాంగ్రెస్ నాయకులు స్థాయికి మించి విమర్శించడం తగదన్నారు. కాంగ్రెస్ పార్టీకి రైతుల పట్ల ఏ మాత్రం చిత్తశుద్ధి లేదని, రైతుబంధు, రైతుబీమా లాంటి పథకాలు ఎందుకు అమలు చేయలేదని ప్రశ్నించారు. ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన హామీలను నేరవేర్చాలని హెచ్చరించారు. సమావేశంలో నాయకులు మహేశ్, శ్రీను, కృష్ణ, రవి, అంజాద్, గోపాల్, ప్రశాంత్, శేఖర్, రాజు తదితరులు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలని డిమాండ్

- 24న కలెక్టరేట్ వద్ద మధ్యాహ్న భోజన కార్మికుల ధర్నా



ఎంఈఓకు వినతిపత్రం ఇస్తున్న మధ్యాహ్న భోజన యూనియన్ నేతలు

ఇబ్రహీంపట్నం: మధ్యాహ్న భోజన పథకం కార్మికుల సమస్యలను పరిష్కరించాలని ప్రభుత్వాన్ని ఆ యూనియన్ రాష్ట్ర అధ్యక్షురాలు యెలామోని స్వప్న డిమాండ్ చేశారు. ఈ మేరకు మండల విద్యాధికారి హీర్యానాయక్‌కు శుక్రవారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. మధ్యాహ్న కార్మికులకు ఆరు నెలల నుంచి పెండింగ్‌లో ఉన్న బిల్లులు చెల్లించాలని, వంటగ్యాస్, వారానికి మూడు రోజుల కోడి గుడ్లను, నాణ్యత గల బియ్యం పంపిణీ చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. అదేవిధంగా కార్మికులకు గుర్తింపు కార్డులు ఇవ్వాలని, నెలకు పది వేల వేతనం ఇస్తామని కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీని నిలబెట్టుకోవాలన్నారు. మధ్యాహ్న భోజన కార్మికుల సమస్యల పరిష్కారానికి ఈ నెల 24న జిల్లా కలెక్టరేట్‌ల ఎదుట ధర్నా నిర్వహించనున్నట్లు ఆమె తెలిపారు. కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు ఎల్లేశ్, లావణ్య పాల్గొన్నారు.

ఘనంగా మాతృభాషా దినోత్సవం



ఇబ్రహీంపట్నం: ఉపాధ్యాయులకు సన్మానం



మాడ్గుల: మాట్లాడుతున్న ఎంఈఓ

ఇబ్రహీంపట్నం: అంతర్జాతీయ మాతృభాషా దినోత్సవాన్ని పురస్కరించుకొని శుక్రవారం ఇబ్రహీంపట్నం జెడ్పీహెచ్‌ఎస్‌లో తెలుగు, ఉర్దూ, ఆంగ్ల భాషలను బోధించే ఉపాధ్యాయులను పీఆర్టీయూ ఆధ్వర్యంలో సన్మానించారు. కార్యక్రమంలో ఆ సంఘం మండల అధ్యక్షుడు పరమేశ్ నాయకులు ఆనంద్‌కుమార్, గోవర్ధన్, జీహెచ్‌ఎం రాధాకృష్ణారావు పాల్గొన్నారు.

మాడ్గులలో..

మాడ్గుల: అంతర్జాతీయ మాతృభాషా దినోత్సవాన్ని పురస్కరించుకొని స్థానిక కస్తూర్బాగాంధీ పాఠశాలలో శుక్రవారం వేడుకలు ఘనంగా నిర్వహించారు. విద్యార్థులు, పద్యపఠన, కవితలు, పొడుపు కథలు, తెలుగు కవుల వేషధారణలో కనువిందు చేశారు. ఈ సందర్భంగా ఎంఈఓ సర్దార్ నాయక్ మాట్లాడుతూ తెలుగు భాష గొప్పదనాన్ని విద్యార్థులకు వివరించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ పద్మావతి, మండల నోడల్ ఆఫీసర్ పర్వతాలు, ఎస్‌వో రేఖ, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

స్కాలర్‌షిప్‌నకు విద్యార్థుల ఎంపిక

కేశంపేట: నిరుపేద విద్యార్థుల చదువుకు ఆర్థిక సాయం అందించాలనే లక్ష్యంతో కేంద్ర ప్రభుత్వం ఎన్‌ఎంఎంఎస్‌తో ప్రోత్సహిస్తోంది. ఇటీవల కేంద్ర ప్రభుత్వం నేషనల్ మీన్స్ కమ్ మెరిట్ పథకం(ఎన్‌ఎంఎంఎస్) ద్వారా 8వ తరగతి చదువుతున్న విద్యార్థులకు ప్రతిభ పరీక్షలను నిర్వహించింది. అందులో కేశంపేట గ్రామంలోని జెడ్పీ ఉన్నత పాఠశాలకు చెందిన ముగ్గురు విద్యార్థులు సత్తా చాటారు. స్కాలర్‌షిప్‌నకు ఎంపికైన ఆదిత్య, సరయూ, చందనలను మండల విద్యాధికారి చంద్రశేఖర్ అభినందించారు. వీరికి వచ్చే విద్యా సంవత్సరం నుంచి కేంద్ర ప్రభుత్వం సంవత్సరానికి రూ.12 వేలు అందిస్తుందని ఉపాధ్యాయులు తెలిపారు.

ఆడబిడ్డ వివాహానికి చేయూత

కడ్తాల్: మండలంలోని గానుగుమార్లతండా పంచాయతీ పరిధిలోని కానుగుబావితండాకు చెందిన నేనావత్ రాజు, అనితల కుమార్తె ఝాన్సీ వివాహానికి స్థానిక కాంగ్రెస్ నాయకులు లక్పతినాయక్, బీక్యానాయక్, రాజు నాయక్‌లు ఆర్థికసాయం అందించారు. శుక్రవారం తండాలో స్థానిక నేతల సమక్షంలో రూ.15 వేలు అందజేశారు.

ఆమనగల్లు వైద్య సిబ్బందికి పురస్కారం



ఆమనగల్లు వైద్య సిబ్బందిని సత్కరిస్తున్న డా.చంద్రశేఖర్

ఆమనగల్లు: పట్టణంలోని ప్రభుత్వాసుపత్రిలో నర్సింగ్ ఆఫీసర్‌గా విధులు నిర్వహిస్తున్న సుచేత, మేరీరత్న జ్యోతిలకు జిల్లా హాస్పిటల్ సర్వీసెస్ కో ఆర్డినేటర్ డా.చంద్రశేఖర్ ప్రశంసాపత్రం, పురస్కారం అందించారు. విధుల పట్ల అంకితభావంతో పనిచేస్తున్న వీరికి కొండాపూర్‌లోని జిల్లా ఆసుపత్రిలో ఏర్పాటు చేసిన సమావేశంలో శుక్రవారం అందజేశారు. కార్యక్రమంలో ఆమనగల్లు ప్రభుత్వాసుపత్రి వైద్యాధికారి డా.నాగారాజు ఉన్నారు.

విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలి



విద్యార్థులతో మాట్లాడుతున్న ఎంపీడీఓ నరేందర్‌రెడ్డి

యాచారం: వసతి గృహాల్లో చదువుకుంటున్న విద్యార్థులకు మెరుగైన విద్యతో పాటు నాణ్యమైన భోజనం అందించాలని ఎంపీడీఓ నరేందర్‌రెడ్డి సూచించారు. మండల కేంద్రంలో ఉన్న సాంఘిక సంక్షేమ వసతి గృహాన్ని శుక్రవారం ఆయన సందర్శించారు. విద్యార్థులతో మాట్లాడి విద్యాబోధన ఎలా ఉంది. భోజనం నాణ్యంగా ఉంటుందా.. అని అడిగి తెలుసుకున్నారు. అనంతరం వంట గదిలో నిల్వ ఉన్న కూరగాయలు, ఇతర సరుకులను పరిశీలించారు. కార్యక్రమంలో వసతి గృహం ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

నేడు హామీ పనులపై ప్రజావేదిక

శంకర్‌పల్లి: ఉపాధి హామీ పనులపై సామాజిక తనిఖీ నిమిత్తం మండల పరిషత్ కార్యాలయంలో శనివారం ఉదయం ప్రజావేదిక ఏర్పాటు చేసినట్లు ఎంపీడీఓ వెంకయ్య ఓ ప్రకటనలో తెలిపారు. 2023 ఏప్రిల్ నుంచి 2024 మార్చి వరకు జరిగిన ఉపాధి హామీ పనులపై సమావేశం ఉంటుందని, దీంట్లో ఉపాధి హామీ కూలీలకు సంబంధించిన వేతనాలు, చెల్లింపులు, పనుల నాణ్యత, ఇతర పనులపై ప్రజావేదికలో ప్రవేశ పెట్టనున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమానికి ప్రతి ఒక్కరూ హాజరై, సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

భావితరాలకు స్వచ్ఛమైన పుడమి

సీజీఆర్ ఫౌండర్ లక్ష్మారెడ్డి



పర్యావరణ పరిరక్షణపై ప్రసంగిస్తున్న లక్ష్మారెడ్డి

కడ్తాల్: భవిష్యత్ తరాలకు స్వచ్ఛమైన పుడమిని అందించేందుకు ప్రతిఒక్కరూ కృషి చేయాలని, కౌన్సిల్ ఫర్ గ్రీన్ రెవల్యూషన్ ఫౌండర్ కోర్పోలు లక్ష్మారెడ్డి పిలుపునిచ్చారు. మండల పరిధిలోని అన్మాస్‌పల్లి గ్రామ సమీపంలోని ఎర్త్ సెంటర్‌లో గత రెండు రోజుల నుంచి నిర్వహించిన పర్యావరణ అవగాహన సదస్సు శుక్రవారంతో ముగిసింది. సదస్సుకు జిల్లాలోని పీఎంశ్రీ మోడల్ స్కూల్ షాబాద్‌కు చెందిన 300 మంది విద్యార్థులు హాజరయ్యారు. ఈ సందర్భంగా లక్ష్మారెడ్డి మాట్లాడుతూ.. ప్రకృతిని విస్మరిస్తే జీవకోటి మనుగడ ప్రశ్నార్థకమవుతుందని, సహజసిద్ధ వనరులను కాపాడే బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని చెప్పారు. చిన్నప్పటి నుంచే విద్యార్థులకు పర్యావరణంపై అవగాహన కల్పించాలని సూచించారు. అనంతరం సీజీఆర్ సంస్థ అధికార ప్రతినిధి జ్ఞానేశ్వర్ అడవుల రకాలు, విత్తన తయారీ, బయో ఎంజైమ్ గురించి అవగాహన కల్పించారు. తడి పొడి చెత్త వేరు చేసే విధానాన్ని ప్రదర్శనతో పర్యావరణ వేత్త అన్నమయ్య వివరించారు. కార్యక్రమంలో స్కూల్ వైస్ ప్రిన్సిపాల్ రాఘవేంద్ర, సీజీఆర్ సిబ్బంది నగేశ్, పాఠశాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

కాంగ్రెస్‌తోనే సామాజిక న్యాయం

బీసీ కమిషన్ రాష్ట్ర సభ్యుడు జయప్రకాష్



జయప్రకాష్‌ను సన్మానిస్తున్న కమిషనర్ బాలకృష్ణ

ఇబ్రహీంపట్నం రూరల్: కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలోనే బీసీలకు సామాజిక న్యాయం దక్కుతుందని బీసీ కమిషన్ రాష్ట్ర సభ్యుడు రాపోలు జయప్రకాష్ ధీమా వ్యక్తం చేశారు. శుక్రవారం ఆదిబట్ల మున్సిపాలిటీ కార్యాలయంలో మాజీ సర్పంచ్ ఈసీ శేఖర్‌గౌడ్ ఆధ్వర్యంలో కులగణన రీసర్వేపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా జయప్రకాష్ మాట్లాడుతూ.. బీసీలకు చట్టసభల్లో రిజర్వేషన్లు కల్పించడానికి కులగణన చేసి మొదటి ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అన్నారు. దేశంలోనే ఎవరూ చేయని సాహసోపేతమైన కార్యక్రమానికి శ్రీకారం చుట్టిన నాయకుడన్నారు. అసెంబ్లీలో తీర్మానం చేసి చట్టబద్ధత కల్పించడానికి కృషి చేస్తున్నరన్నారు. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు న్యాయం దక్కుతుందన్నారు. కాంగ్రెస్ పార్టీ పేద, బడుగు బలహీన వర్గాలకు పెద్దపీట వేస్తుందన్నారు. కులగణనలో ఇప్పటికీ పేర్లు నమోదు చేసుకొని వారికి ఈ నెల 28వ తేదీ వరకు చివరి అవకాశం ఉందని చెప్పారు. కార్యక్రమంలో కమిషనర్ బాలకృష్ణ, నాయకులు రజినీకాంత్‌గౌడ్, కృష్ణ, దేవగౌడ్, దర్శన్, సాయిబాబాగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

నేడు ఎమ్మెల్యే మల్‌రెడ్డి పర్యటన

ఇబ్రహీంపట్నం: నియోజకవర్గంలో ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి శనివారం వివిధ అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలల్లో పాల్గొననున్నట్లు క్యాంపు కార్యాలయ వర్గాలు ఒక ప్రకటనలో తెలిపాయి. ఉదయం 10:30 గంటలకు బాటసింగారంలోని బ్రిలియంట్ కాలేజీలో డ్రగ్స్‌పై అవగాహన, పెద్దఅంబర్‌పేట ఇందిర గార్డెన్స్‌లో అబ్దుల్లాపూర్‌మెట్ మండలానికి సంబంధించిన రూ.1.63 కోట్ల కల్యాణలక్ష్మీ, షాదీ ముబారక్ లబ్ధిదారులకు చెక్కుల పంపిణీ, మధ్యాహ్నం 12:30 గంటలకు రాందాస్‌పల్లి చౌరస్తాలో రూ.10.50 కోట్ల వ్యయంతో నిర్మించే రోడ్డు పనులకు శంకుస్థాపన, ఒంటి గంటకు పోచారం, కర్ణంగూడ పరిధిలోని లక్ష్మీనరసింహాస్వామి ఆలయ దర్శనం, మధ్యాహ్నం 1:30 గంటలకు ఇబ్రహీంపట్నంలో, 2 గంటలకు ఖానాపూర్‌లో బస్తీ దవాఖానాల ప్రారంభోత్సవాలకు ఎమ్మెల్యే హాజరుకానున్నట్లు వెల్లడించారు.

కల్యాణలక్ష్మి చెక్కుల పంపిణీ

అబ్దుల్లాపూర్‌మెట్: పెద్దఅంబర్‌పేట, తుర్కయంజాల్ మున్సిపాలిటీలతో పాటు అబ్దుల్లాపూర్‌మెట్ మండలానికి చెందిన కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్ లబ్ధిదారులకు శనివారం పెద్దఅంబర్‌పేటలోని ఇందిరాగార్డెన్స్‌లో చెక్కుల పంపిణీ చేయనున్నట్లు తహసీల్దార్ బి.సుదర్శన్‌రెడ్డి తెలిపారు. ఉదయం 11.30 గంటలకు జరిగే ఈ కార్యక్రమానికి ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్‌రెడ్డిరంగారెడ్డి ముఖ్యఅతిథిగా హాజరై లబ్ధిదారులకు చెక్కులు అందజేయనున్నట్లు ఆయన పేర్కొన్నారు.

శివస్వాముల ప్రత్యేక పూజలు



ఆలయంలో పూజలో శివస్వాములు

ఆమనగల్లు: పట్టణంలోని శ్రీ భవానీ రామలింగేశ్వరస్వామి దేవాలయంలో శుక్రవారం శివస్వాముల ఆధ్వర్యంలో ఇరుముడి పూజ నిర్వహించారు. శివమాలలు ధరించిన స్వాములు శ్రీశైలం దేవస్థానం వెళ్లడానికి రామలింగేశ్వరస్వామి దేవాలయంలో ఇరుముడులు కట్టుకున్నారు. అంతకు ముందు ఆలయంలో ప్రత్యేకపూజలు, హోమం నిర్వహించారు. అనంతరం కుటుంబ సభ్యులు వీడ్కోలు పలుకగా శ్రీశైలం దేవస్థానం బయలుదేరారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ శ్రీనివాసులు, శివస్వాములు పుల్లయ్య, శ్రీనివాసులు, సాయిలు, గోపాల్, శ్రీను, అశోక్, గోవర్ధన్, రాజశేఖర్, వెంకట్, దేవరాజు, శివ తదితరులు పాల్గొన్నారు.



భక్తులకు పండ్లు, మంచినీరు అందిస్తున్న నిర్వాహకులు

పండ్లు, మంచినీరు పంపిణీ

మహాశివరాత్రి పర్వదినం సందర్భంగా వివిధ ప్రాంతాల నుంచి శ్రీశైలం దేవస్థానానికి పాదయాత్రగా వెళుతున్న శివస్వాములు, భక్తులకు ఆమనగల్లు పట్టణంలో విశ్వవిజయ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఉచితంగా పండ్లు, మంచినీటి బాటిల్స్ పంపిణీ చేస్తున్నారు. పట్టణంలో శుక్రవారం ఈ కార్యక్రమాన్ని శ్రీరామదూత ఆశ్రమ వ్యవస్థాపకులు శివానందస్వామి ప్రారంభించారు. మహాశివరాత్రి వరకు ఉచితంగా పండ్లు, మంచినీటి బాటిల్స్ పంపిణీ చేస్తామని విశ్వవిజయ ఫౌండేషన్ చైర్మన్ దొంతు విశ్వనాదం, విజయలక్ష్మిలు తెలిపారు. కార్యక్రమంలో స్థానికులు డా.పుల్లయ్య, దొంతు శ్రీనివాస్, రామలింగేశ్వరస్వామి పాల్గొన్నారు.

పశువుల ఆరోగ్యంపై అప్రమత్తత అవసరం



పశుపోషకులకు మందులు పంపిణీ చేస్తున్న డాక్టర్ చంద్రశేఖర్‌రెడ్డి

షాబాద్: పశువుల ఆరోగ్యం పట్ల రైతులు అప్రమత్తంగా ఉండాలని రేగడి దోస్వాడ పశువైద్యాధికారి చంద్రశేఖర్‌రెడ్డి సూచించారు. శుక్రవారం మండల పరిధిలోని పోతుగల్ గ్రామంలో పశువుల వైద్య శిబిరం నిర్వహించారు. ఇందులో 12 పాడి ఆవులకు గర్భకోశ వ్యాధి చికిత్సలు చేశారు. 26 పశువులకు చూడి పరీక్షలు నిర్వహించి, 30 దూడలు, గేదెలకు నట్టల నివారణ మందులు తాగించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... సకాలంలో పశువులకు వైద్యం అందిస్తే అధిక పాల దిగుబడి వస్తుందని తెలిపారు. మేలు రకం పశువుల ఎంపిక ద్వారా ఆదాయం పొందవచ్చని చెప్పారు. కార్యక్రమంలో గోపాలమిత్ర విద్యాసాగర్, వైద్య సిబ్బంది శ్రీనివాస్, సుధాకర్, రైతులు తదితరులు పాల్గొన్నారు.

స్వచ్ఛమైన నీటిని అందించండి

తహసీల్దార్ అజాంఅలీ



వంట పాత్రలను పరిశీలిస్తున్న తహసీల్దార్

కేశంపేట: స్వచ్ఛమైన తాగునీటిని విద్యార్థులకు అందించాలని తహసీల్దార్ అజాంఅలీ సూచించారు. మండల పరిధిలోని పాటిగడ్డ గ్రామంలో ఉన్న కేజీబీవీ పాఠశాలను ఆయన శుక్రవారం సందర్శించారు. ఈ సందర్భంగా పాఠశాల ఆవరణతో పాటు కిచెన్ షెడ్‌ను పరిశీలించారు. కిచెన్‌షెడ్‌లో నిల్వ ఉన్న కూరగాయలతో పాటు వంట పాత్రలను క్షుణ్ణంగా తనిఖీ చేశారు. పాఠశాల నిర్వహణ పైన విద్యార్థినులను అడిగి వివరాలను తెలుసుకున్నారు. నాణ్య మైన భోజనంతో పాటు స్వచ్ఛమైన తాగునీటిని అందించాలని పాఠశాల ఎస్‌ఓ గౌసియాకు సూచించారు. విద్యార్థినుల ఆరోగ్యం పట్ల తగిన జాగ్రత్తలను పాటించాలని తెలిపారు.